# చీకటిలో నీడలు

డాక్టర్ వ్యాకరణం అచ్యుత రామారావు

ఎమెస్కో

## 1.0

# చెంగల్రావు పేట, విశాఖపట్టణం, సెప్టెంబర్ 1965

**ఇండియా – పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం మొదలై పది రోజులయింది. ఉత్తర భారతమంతా అట్టుడికినట్లు యుద్ధవార్తలతో వేడెక్కిపోతున్నా, దక్షిణ రాష్ట్రాలలో యుద్ధ ప్రభావం అంతగా కనపడటంలేదు. గత నాలుగు రోజులుగా ప్రధాన నౌకాకేంద్రమైన విశాఖపట్నం మీద దాడి చేయడానికి ఒక జలాంతర్గామి అప్పటి తూర్పు పాకిస్థాన్ రాజధాని ఢాకా నుంచి బయలుదేరిందనే పుకారు మొదలయినా, విశాఖలో సామాన్య పౌరులంతా అదేమీ పట్టించుకోకుండా మామూలుగా ఎప్పటిలాగానే జీవితాలు వెళ్ళదీస్తున్నారు.....**

సాయంత్రం ఆరు అయివుంటుంది. చలికాలం ఇంకా మొదలవలేదు కానీ విశాఖపట్నంలో సాయంకాలానికల్లా సముద్రం మీదనుంచి వచ్చే చల్లటిగాలి ప్రభావం వల్లనేమో, కొద్దిగా చలిగానే అనిపిస్తోంది. పొద్దున్నించీ తీక్షణంగా వెలిగిన సూర్యుడు జేబులు ఖాళీ అయిపోయి క్లబ్బులోంచి బయటికి వచ్చిన పేకాటరాయుడిలా నీరసంగా పడమటి కొండల చాటుకి దిగిపోతున్నాడు. పిట్టలన్నీ హడావిడిగా సూర్యుడికంటే ముందుగానే గూళ్లకి చేరాలని పోటీగా పరిగెడుతున్నాయి.

మిసెస్ ఏవిఎన్ కాలేజి గేట్లోంచి బయటకు వచ్చిన విష్ణుప్రసాదూ, అతని మిత్రుడు బ్రహ్మానందం ఏదో మాట్లాడుకుంటూ చెంగల్రావుపేట వేపు నడుస్తున్నారు. విష్ణుప్రసాదు నాజుకైన మనిషి. ఐదడుగుల ఎనిమిది అంగుళాల ఎత్తులో వుంటాడు. అతని నూనూగు మీసాలని చూడగానే ఇరవై ఏళ్లు దాటిన వయసులో వుంటాడని ఇట్టే తెలిసిపోతుంది. మరీ అంత తెలుపు కాకపోయినా గోధుమ రంగు ఛాయతో, రిమ్